క్లుప్తంగా

వాసవీక్లబ్స్ అడిషినల్ వైస్ గవర్నర్‌గా ఆత్మకూరి

సత్తెనపల్లి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్-204ఏ అడిషినల్ వైస్ గవర్నర్‌గా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్యను నియమించారు. ఈ మేరకు గవర్నర్ కొలిశెట్టి శివ సుబ్రహ్మణ్యం బుధవారం సత్తెనపల్లిలో ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్యకు నియామక పత్రాన్ని అందించారు. 2024 సంవత్సరానికి గాను ఆయన అడిషినల్ వైస్ గవర్నర్‌గా సేవలు అందించనున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్యను పట్టణ ఆర్యవైశ్య సంఘ నాయకులు, వాసవీ క్లబ్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. వారిలో కట్టమూరి అప్పారావు, సూరే వెంకట కోటిలింగం, కోట నాగవరలక్ష్మి, కోట వెంకట బసవయ్య, తవ్వా నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అన్ని వర్గాల మెప్పు పొందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు వారి కుటుంబాలతో సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన కొడవటి జక్రయ్య, తాళ్ల పోగు బుల్లోడు కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకర రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలు బుధవారం సత్తెనపల్లి మండలంలో ఉత్సాహంగా సాగాయి. మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి క్రీడా పోటీలను నిర్వహించారు. కొమెరపూడి, నందిగామ, ఫణిదం, బృగుబండ గ్రామాల్లో బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ నేతృత్వంలో నోడల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు ఉన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు: ఆడుదాం-ఆంధ్రా ఆటలు మండలంలోని 15 సచివాలయాల్లో జరుగుతున్నాయి. బుధవారం క్రోసూరు జెడ్పీపాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. జెడ్పీపాఠశాల పీడీ శ్రీధర్ మాట్లాడుతూ ఎక్కువగా యువత క్రికెట్ ఆడుతున్నట్లు తెలిపారు. మండల స్థాయి ఆటల కోసం క్రికెట్ టీంలను ఎంపిక చేసి ఈ నెల 10వ తేదీ తరువాత పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ క్రీడల్లో సైతం ప్రతిభగల జట్లను మండల స్థాయికి ఎంపిక చేసి పోటీలు నిర్వహించి నియోజకవర్గ స్థాయికి తీసుకెళ్తామని అన్నారు. మండలస్థాయి జట్లకు క్రీడా పరికరాలు, డ్రస్ అందిస్తారని తెలిపారు.

'జగనన్న విద్యాజ్యోతి' మెటీరియల్స్ పంపిణీ



బెల్లంకొండ: పదవ తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన జగనన్న 'విద్యాజ్యోతి' స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని చంద్రాజుపాలెం జడ్పీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ ద్వారా సరఫరా చేసిన స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. జడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి మాట్లాడారు. పాఠశాల చైర్మన్ రాంబాబు, గ్రామ సర్పంచ్ కొడవటి కరీముల్లా బాబూజీ, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, గాదె మిల్లు వెంకటరెడ్డి, సాయిరెడ్డి, వేల్పుల కోటేశ్వరరావు, కొడవటి కోటేశ్వరరావు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిపాడులో...

గుడిపాడు(క్రోసూరు): మండలంలోని గుడిపాడు జెడ్పీపాఠశాల పదవతరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ బుధవారం అందజేశారు. పాఠశాల హెచ్ఎం గట్టు భాస్కరరావు అధ్యక్షతన ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ జమీలాగఫూర్, ఎంపీపీ పి.కోటయ్య, పాల్గొని పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, షేక్ ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్.. ఆనందాలు పెంచెన్

- అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం
- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- లబ్ధిదారులకు పెంచిన పెన్షన్లు అందజేత



క్రోసూరులో రూ.3వేలకు పెరిగిన పెన్షన్‌ను ఎమ్మెల్యే శంకరరావు చేతులమీదుగా అందుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

క్రోసూరు: గడప గడపకు అందుతున్న సంక్షేమం, అంతటా జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు-2 సచివాలయ పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా రూ.3 వేలకు పెంచిన పెన్షన్లను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. క్రోసూరు కొండ కింద బజారులో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లను అందజేశారు. సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ. 2019 నాటికి క్రోసూరులో 6445 మందికి రూ.64.45 లక్షలు పెన్షన్లు మాత్రమే అందేవన్నారు. ఇప్పుడు 9057 మందికి రూ.2.67 కోట్లు పెన్షన్ల రూపంలో అందుతున్నాయని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ను రూ.3 వేలకు పెంచారన్నారు. పెన్షన్ పెంపుతో లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనిపిస్తోందన్నారు. రాష్ట్రాన్ని సీఎ వైఎస్ జగన్ అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్న తనను మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మల్లా చందమామ, ఉపసర్పంచ్ షేక్ మస్తాన్, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, వెలది అప్పారావు, గార్లపాటి దాసు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రాజుపాలెంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

జగనన్న పాలనలో సంక్షేమ స్వరాజ్యం..

బెల్లంకొండ: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, జగనన్న పాలనలో అంతా సంక్షేమమేనని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. బుధవారం మండలంలోని వన్నాయపాలెం, చంద్రాజుపాలెం గ్రామాలలో రూ.3వేలు పెంచిన వైఎస్సార్ ఆసరా పింఛన్లను ఆయన ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలోని మహానేత, దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. అదేవిధంగా సమస్యలు తెలుసుకున్నారు. బెల్లంకొండ మండల వ్యాప్తంగా 2019 నాటికి 3412 మందికి రూ.34 లక్షలు మాత్రమే అందేదని, ఇప్పుడు 4253 మందికి 1.30 కోట్ల పింఛను ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ చేస్తున్న మంచిని గుర్తించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి, తహసీల్దార్ క్షమారాణి, మండల నాయకులు చింతారెడ్డి సాయిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీలు బూదాటి మరియదాసు, అహ్మద్ పాషా, సొసైటీ అధ్యక్షుడు భద్రయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ నందిగంపై దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

సత్తెనపల్లి: దళిత వర్గానికి చెందిన బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌పై అమరావతి కరకట్ట మార్గంలో దాడికి యత్నించి, భయ భ్రాంతులకు గురిచేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలకా జైపాల్ బుధవారం డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా ఎంపీ నందిగం సురేష్ కారును అటకాయించి, చిటికలు వేస్తూ నీ సంగతి తేలుస్తాం అంటూ హెచ్చరించటం దారుణమన్నారు. దళిత నేతల జోలికి వస్తే తాటతీస్తామని హెచ్చరించారు.

మినీ లారీ ఢీకొని వ్యక్తి మృతి



మన్సూర్‌వలి(ఫైల్)

ముప్పాళ్ళ: వేగంగా వచ్చిన మినీ లారీ ఢీకొట్టగా వ్యక్తి మృతి చెందిన సంఘటన ముప్పాళ్ల సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముప్పాళ్ల ముస్లిం కాలనీకి చెందిన షేక్ మన్సూర్‌వలి(40) గ్రామ సమీపంలోని పెట్రోల్‌బంక్ ఎదురుగా కూరగాయల దుకాణం నిర్వహిస్తుంటాడు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో దుకాణం వద్దే కూర్చొని కూరగాయలు శుభ్రం చేస్తుండగా సత్తెనపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న మినీ లారీ మన్సూర్‌వలిని ఢీ కొట్టి, కొద్దిదూరం లాక్కెళ్ళింది. అప్పటికే మన్సూర్‌వలి తలకు గాయమై తీవ్ర రక్తస్రావం కావటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించటంతో అక్కడి వైద్యుల సూచన మేరకు గుంటూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మహిళోద్ధరణకు సావిత్రీబాయి విశేష కృషి



వెంగళరెడ్డినగర్‌లో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు



సుగాలి కాలని జడ్పీ పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్ఎం లత ప్రియదర్శిని, ఉపాధ్యాయులు

- బీసీ చైతన్య సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కొండయ్య
- వాడవాడలా సావిత్రిబాయి జయంతి వేడుకలు

సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని నిరూపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీ చైతన్య సమితి నియోజకవర్గ అధ్యక్షుడు వేముల కొండయ్య అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. బీసీ సంఘాల నాయకులు చింకా అంకమ్మ రావు, పత్తిపాటి హరేకృష్ణ, పిక్కలి శివ, విజయ్, షేక్ చిన్న షరీఫ్, కంటూ వెంకట్రామయ్య, విప్పర్ల కొండలు, చింతపల్లి లాజర్, దుద్దిల్ల జగన్నాథం పాల్గొన్నారు.

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వ హించారు. సోషల్ వెల్ఫేర్ కళాశాల బాలికల వసతి గృహం అధికారిణి పి.రాణిమ్మ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడారు. హెల్ప్ ఫౌండేషన్ సభ్యులు శ్రీలత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో...

సత్తెనపల్లి మండలం కట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కో-ఆర్డినేటర్ మల్లెల చెన్నప్ప మాట్లాడుతూ విద్య రంగానికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం..

సత్తెనపల్లి: మహిళల అభ్యున్నతికి విద్య అవసరమని జ్యోతిరావు పూలే సహకారంతో బాలికా పాఠశాలను ప్రారంభించి సావిత్రిబాయి అందరికీ ఆదర్శంగా నిలిచారని సుగాలి కాలని జడ్పీ పాఠశాల హెచ్ఎం కె.లతా ప్రియదర్శిని అన్నారు. మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పట్టణంలోని సుగాలి కాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సిహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సంఘసంస్కర్తగా, ఉపాధ్యాయునిగా, రచయితగా, మహిళా సాధికారతకు కృషి చేశారని కొనియాడారు. అనంతరం మహిళా ఉపాధ్యాయినులు చంద్రలీల,పద్మావతి, పూర్ణిమదేవి, ఝాన్సీ రాణి, షకీనా, శాంతి మృదుల, సుధారాణి, భారతి, సీతమ్మలను ఉపాధ్యాయ బృందం సత్కరించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు అబ్దుల్ రజాక్, ఐఎస్ నాగిరెడ్డి, పెద్దింటి వెంకట కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీకి ఇన్వర్టర్ అందజేత

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని బాలింతల వార్డుకు స్నేహహస్తాలు ఫౌండేషన్ వారు రూ. 22వేలు విలువచేసే విద్యుత్ ఇన్వర్టర్, బ్యాటరీని విరాళంగా పంచాయతీ విస్తరణాధికారి వీర్రాజు ద్వారా పీహెచ్‌సీ సిబ్బందికి అందచేశారు. సంస్థ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, ఎంఈఓ నరశింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాజేష్, వైద్య విస్తరణాధికారి పి.వెంకట్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని జడ్పీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని ఓటర్లకు ఈవీఎమ్‌ల పై ఉన్న సందేహాలను తొలగించారు.

హరి సర్వోత్తమ అలంకరణలో శ్రీవారు

సత్తెనపల్లి: ధనుర్మాసంను పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి శ్రీ రామాలయం వేంకటేశ్వర స్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్డు లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విత్తనాల పంపిణీలో వివక్ష లేదు

- ప్రభుత్వ నిబంధనలకు లోబడే పంపిణీ చేశాం
- ఈనాడులో వచ్చిన కథనం వాస్తవ దూరం
- మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్

అమరావతి: మండలంలో మిచౌంగ్ తుఫాన్ వల్ల దెబ్బతిన్న కంది, మినుము, పుల్లశనగ పంటలను వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు గుర్తించి నష్టపోయిన రైతుల జాబితాలను గ్రామాలలోని రైతుభరోసా కేంద్రం, సచివాలయాలలో ప్రదర్శించామని మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈక్రమంలో బుధవారం ఈనాడు పత్రికలో 'నాయకా విత్తనాల్లోనూ వివక్షేనా' శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. ఈకథనం వాస్తవానికి భిన్నంగా ఉందన్నారు. మండలంలో పంటనష్టపోయిన పొలాల రైతులకు మాత్రమే 80శాతం రాయితీతో విత్తనాలను పంపిణీ చేశామన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి 752 క్వింటాళ్ల జెజి-11 విత్తనాలు, 115 క్వింటాళ్ల కెఎకె-2 విత్తనాలను 20 కిలోల సంచులలో మంజూరు చేయటం జరిగిందన్నారు. ఒక ఎకరాకు ప్రభుత్వ ఆదేశాల మేరకు 40కిలోల విత్తనాలను రైతులకు అందించామన్నారు. ఈనాడు పత్రికలో తమకు విత్తనాల పంపిణీలో వివక్ష జరిగిందని చెప్పిన రైతు గోరంట్ల సర్వేశ్వరరాజుకు ఖాతా నెంబరు-162లో సర్వేనంబరు70-ఎ,70-బిలలో ఉన్న ఎకరాకు రెండు ఇరవై కిలోల సంచుల విత్తనాలను ఆన్‌లైన్‌లో వేలిముద్రలు తీసుకుని ఇవ్వటం జరిగిందన్నారు. మరో రైతు గోరంట్ల నాగరాజుకు చెందిన ఖాతా నెంబర్- 1829, 100002లలో ఉన్న సర్వేనెంబరు 27-3డి, 27-1సి, 27-1, 27-3 లలో ఉన్న 4.20 సెంట్ల విస్తీర్ణానికి ఆన్‌లైన్‌లో 20 కిలోలు కల్గిన 8 సంచులు ఇవ్వటం జరిగిందన్నారు. అలాగే యేళ్ల కృష్ణారావుకు చెందిన ఖాతా నెంబరు 1271లో సర్వేనెంబరు33/1బి1,33/1బి2లలో 64సెంట్ల భూమికి రెండు సంచులు, తెనాలి కోటేశ్వరరావుకు ఖాతా నెంబరు-746లో సర్వేనెంబరు 66/బిలో ఉన్న 86సెంట్లకు రెండు సంచులు ఆన్‌లైన్‌లో ఇచ్చామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎటువంటి వివక్ష లేకుండా రైతులకు సబ్సిడీ విత్తనాలను అందించామన్నారు.

■ ఈవిషయంపై గ్రామసర్పంచ్ నాయుడు రాంబాబు మాట్లాడుతూ ఈనాడు పత్రిక తెలుగుదేశం నాయకులు చెప్పిన అబద్ధాలు, అవాస్తవాలు ప్రచురించటం దారుణమన్నారు. గ్రామంలో విచారించకుండా పిచ్చిరాతలు రాయటం ఆ పత్రికకే చెల్లిందన్నారు. గ్రామంలో వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులందరికి పార్టీలకు అతీతంగా విత్తనాలు పంపిణీ చేశామన్నారు. వర్షాల వల్ల శనగ పంటవేసి నష్టపోయిన రైతులకు మాత్రమే సబ్సిడీ విత్తనాలు ప్రభుత్వం మంజూరు చేసిందని పత్తి పంట పూర్తయిన తర్వాత అందులో కూడా మళ్లీ శనగ పంట వేయటానికి సబ్సిడీ విత్తనాలు మంజూరు చేయలేదన్నారు. వాస్తవాలను గ్రహించకుండా రైతులను ఆదుకున్న ప్రభుత్వంపైన, పారదర్శకంగా విత్తనాలు పంపిణీ చేసిన అధికారులపైన బురదచల్లటం సబబు కాదన్నారు.

రంగవల్లులు సంప్రదాయానికి ప్రతిబింబాలు

- మంత్రి అంబటి రాంబాబు
- మాదలలో ముగ్గుల పోటీల పరిశీలన



కంటెపూడిలో మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న మహిళలు

మాదల(ముప్పాళ్ళ): గ్రామీణ సాంప్రదాయాలను ప్రోత్సహించేందుకే ప్రతి ఏటా సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. మండలంలోని మాదల గ్రామంలో జరుగుతున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను బుధవారం పరిశీలించారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నామన్నారు. పోటీలకు మహిళలనుంచి విశేషమైన ఆదరణ లభిస్తుందన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో జరిగే పోటీల్లోని విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించటం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల వారికి అందిస్తామన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో రూ.3వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలతో పాటుగా కన్సోలేషన్ బహుమతి అందిస్తామన్నారు. ప్రతి ఏటా జరిగే ఈ సంబరాల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపటం ఆనందంగా ఉందన్నారు. మొదటి రోజు జరిగిన ఈ పోటీల్లో 88 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరినీ ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గీతా హాసంతి, ఎంపీటీసీ గోగుల అంజిబాబు, ఉప సర్పంచ్ చిమటా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎంజేఎం రామలింగారెడ్డి, మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కానాల పుల్లారెడ్డి, తిరుమలశెట్టి అయ్యప్ప, సొసైటీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జంగాల శ్రీనివాసరావు, దమ్మాలపాటి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించేందుకే..

సత్తెనపల్లి: మహిళలను ప్రోత్సహించేందుకు ఏటా వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని 9,10 వార్డులల్లో, సత్తెనపల్లి మండలం కంటెపూడి, ముప్పాళ్ళ మండలం మాదల, రాజుపాలెం మండలం అంచుల వారి పాలెం గ్రామంలో బుధవారం వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ఐదేళ్ల నుంచి ఏటా ఈ ముగ్గుల పోటీలను నిర్వహించి తద్వారా భావి తరాలకు సంస్కృతి, సాంప్రదాయాలను తెలియ చేయడం జరుగుతుందన్నారు. పోటీల విజేతలతో ఈ నెల 12వ తేదీన నియోజకవర్గస్థాయి పోటీలు సత్తెనపల్లిలో భారీస్థాయిలో నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. కంటెపూడిలో మొత్తం 243 మంది మహిళలు హాజరై పోటీల్లో పాల్గొనడంతో గ్రామంలోని సీసీ రోడ్లన్నీ రంగవల్లులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబును పూలమాలలు, దుశ్శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు.

నకరికల్లులో...

నకరికల్లు: మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చేజర్లలో నిర్వహించిన ముగ్గులపోటీల్లో న్యాయనిర్ణేతలు ఐదుగురిని ఎంపిక చేశారు. మొదటిస్థానంలో ఈపూరి వెంకటరమణ, రెండోస్థానంలో గంజనబోయిన నీలమ్మ, మూడోస్థానంలో గజ్జల రజని, నాలుగో స్థానంలో తురకా నాగమణి, ఐదోస్థానంలో పమ్మి వెంకాయమ్మలను ఎంపిక చేశారు. వీరందరూ మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ బొడ్లపాటి కృష్ణకుమారి భాస్కరరెడ్డి, ఎంపీటీసి బొడ్లపాటి వెంకటరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



మాదలలో ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

చలించి.. భరోసానిచ్చి..

- 25 ఏళ్లుగా మస్తిష్క వైకల్యంతో మంచానికే పరిమితం
- బాధితుడి దుస్థితి చూసి చలించిన మంత్రి అంబటి రాంబాబు
- తిరుపతి 'రుయా' ఆసుపత్రిలో వైద్యానికి హామీ
- మంత్రి చొరవతో ఆపరేషన్‌కు ఏర్పాట్లు



మంచానికే పరిమితమైన కుమారుడు నూరుల్లాను చూసి వేదుకుంటున్న మాబు సుభాని

సత్తెనపల్లి: పాతికేళ్ల నరకయాతనకు కాస్త ఉపశమనం దొరకనుంది. చిమ్మ చీకటిలో చిరు దివ్వెలా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు సాయం ఆ కుటుంబంలో వెలుగులు నింపనుంది. వివరాల్లోకి వెళితే.. సత్తెనపల్లి పట్టణం 23వ వార్డులో మాబు సుభాని, షేక్ ఆషా పేద దంపతులు నివశిస్తున్నారు. మాబు సుభాని ఆటో నడుపుతుంటారు. దంపతుల ఇంట పుట్టిన మొదటి సంతానంగా మగ పిల్లవాడు నూరుల్లా జన్మించాడన్న సంతోషం ఆ తల్లిదండ్రులకు కొద్దిసేపు కూడా నిలవలేదు. పుట్టుకతోనే వైకల్యం (సెరిబ్రల్ పాల్సీ- మస్తిష్క పక్షవాతం)తో బిడ్డ జన్మించడంతో వారు తల్లడిల్లిపోయారు. ఇప్పటికి పాతికేళ్లు గడుస్తున్నా, ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేక బిడ్డ నడవలేని స్థితిని చూసి ప్రతిరోజు దేవుణ్ణి వేడుకుంటూనే ఉన్నారు. మెదడుకు సోకిన పక్షవాతంతో కాళ్లు చేతులు వంకర్లు పోయి నోటి మాట కూడా సవ్యంగా రాని పరిస్థితిల్లో రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి అంబటి రాంబాబు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇటీవల ఆ కుటుంబాన్ని సందర్శించారు. నూరుల్లా పరిస్థితి చూసి స్పందించిన మంత్రి తక్షణమే తిరుపతి రుయా వైద్యశాలలో కీలక వైద్యుడికి వీడియో కాల్ చేసి బాధితుణ్ణి చూపించారు. ప్రత్యేక కేసుగా పరిగణించి బిడ్డకు వైద్యం సాయం అందించాలని కోరారు. సాధ్యమైన మేరకు వైద్యం అందిస్తామని, తక్షణం తిరుపతి వైద్యశాలకు పంపించమని సదరు వైద్యులు సూచించారు.